
క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



నాదెండ్ల: నాదెండ్ల గ్రామంలో కొలువైయున్న పురాతన ఆలయమైన శ్రీ గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయ వార్షిక రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను ఆలయ పూజారులు ఇర్లపాటి సాంబశివరావు, కాశీ విశ్వనాధశర్మ, వాసు, సురేష్‌లు పూజలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి రథంపై గ్రామోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గ్రామస్తులు స్వహస్తాలతో రథం లాగుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం 7.30 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి వరకూ రథోత్సవం నిర్వహించారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ సంప్రదాయబద్ధ మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ఆలయంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమాలను కమిటీ చైర్మన్ నల్లమోతు విజయసారధి, దేవాదాయశాఖ అధికారి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణా శిబిరం



నరసరావుపేట రూరల్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో రావిపాడు రోడ్డులోని ప్యారడైజ్ పంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న 5వ యోగా శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. నిర్వహించిన ఆనంద మహోత్సవంలో బోధక యోగాచార్యులు జల్లి శ్రీనివాసరావు, కూనిశెట్టి వెంకటజనార్ధన్ గురూజీ, బత్తుల మురళి, గంగూరి శ్రీనివాసరావులు అతిథులుగా పాల్గొన్నారు. వెంకటేశ్వర యోగి గురూజీ అనుగ్రహ భాషణ ఆశీర్వచనాన్ని చరవాణి ద్వారా అందించారు. శిబిరానికి గైర్హాజరు కాకుండా పాల్గొన్న అభ్యాసకులకు జ్ఞాపికలు అందజేశారు. శ్లోకాలు పదిసార్లు రాసి అప్పజెప్పిన వారికి ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో కావుగంటి శివప్రసాద్ గురూజీ, కనుమర్లపూడి శారద, మాతాజి సహాయ గురువు బండి కొండారెడ్డి, రాగిడి నాగలక్ష్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం



వినుకొండ: రోటరీక్లబ్‌ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా వైద్యశిబిరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో నిర్వహించే వైద్యశిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, చెవి, గొంతు, చర్మవ్యాధులు కీళ్లు, ఎముకలు, జనరల్ వైద్య విభాగాలల్లో పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు చెప్పారు. వినుకొండ చుట్టుపక్కల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. అలాగే కంటివైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు.

మహిళను దూషించిన నలుగురిపై అట్రాసిటీ కేసు

నరసరావుపేటటౌన్: మహిళను కులం పేరుతో దూషించిన నలుగురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి.చరణ్ ఆదివారం తెలిపారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన ఉయ్యాల నాగేశ్వరి కుమారుడు విష్ణుపై ఆటోడ్రైవర్ వెంకటేశ్వరరెడ్డి అతని స్నేహితులు మధు, వంశీ, రాజు మరికొందరు శనివారం దాడికి పాల్పడ్డారు. అడ్డు వచ్చిన తల్లి నాగేశ్వరిని కులం పేరుతో దూషించి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యవసాయ పంపుసెట్ల కేబుళ్లు చోరీ

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలోని పంట పొలాల్లో వ్యవసాయ పంపుసెట్ల కేబుల్ వైర్ల చోరీ ఘటన వెలుగు చూసింది. గోగులపాడు గ్రామానికి చెందిన బొల్లా వెంకటేశ్వర్లు పొలంలో వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. ఈ పంపుసెట్లకు సంబంధించి 130 మీటర్లకు పైగా కేబుళ్లను ఈ నెల 9వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. అపహరణకు గురైన కేబుల్ వైర్ల ఖరీదు రూ.50 వేలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు. ఈ మేరకు రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఇదే పొలంలో రెండు నెలల క్రితం వ్యవసాయంలో ఉపయోగించే స్ప్రింక్లర్లు, మోటార్ల కేబుళ్లు కూడా అపహరణకు గురయ్యాయి. రహదారికి కొంచె దూరంగా ఉండే ఈ పొలంలో పంపుసెట్ల కేబుళ్లు, స్ప్రింక్లర్లు అపహరణకు గురవడం ఇది రెండోసారని బాధితుడు తెలిపారు.

వైభవం.. నృసింహ జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధ గోవిందులు



ప్రత్యేక అలంకరణలో శ్రీరాజ్యలక్ష్మీ సమేత నరసింహుడు

- బరంపేట శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో వేడుకలు
- పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీనారసింహ చతుర్దశిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో నృసింహ జయంతోత్సవం వైభవంగా నిర్వహించారు. బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో శ్రీనారసింహ ఆవిర్భావ దినోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం ఆలయంలోని శ్రీరాధ గోవిందుల మూలమూర్తులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీనారసింహస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు మహా శంఖాభిషేకం, మహారాజ భోగ నివేదంచి భక్తులకు ప్రసాదాలు అందచేశారు. అలాగే సత్తెనపల్లిరోడ్డు పులుపుల వారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనారసింహస్వామి వారి దేవస్థానంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని స్వామివారు చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారి పూలంగి సేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



చందనాలంకరణలో శ్రీయోగానంద నృసింహుడు



వినుకొండలో పొంగళ్లు సమర్పించేందుకు ఊరేగింపుగా వెళుతుతున్న భక్తులు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

వినుకొండ: పట్టణంలోని కొండ మెట్లవద్దనున్న పురాతన లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా 108 మంది మహిళలు పొంగళ్లతో ఊరేగింపుగా దేవాలయం వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం కమిటీ నాయకులు జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. న్యాయవాది పోట్లూరి సైదారావు, సనిశెట్టి లక్ష్మీనారాయణ, జెట్టి శ్రీను, కె.అనంత కోటేశ్వరరావు, బద్దిక వెంకట నరసింహారావు, కాకుమాను రామారావు, విశ్వరూపాచారి, కృష్ణవేణి, సరస్వతి, నాగలక్ష్మీతోపాటు స్వామివారి భక్తబృందం పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు

నరసరావుపేట ఈస్ట్: నృసింహ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పులుపులవారి వీధిలోని శ్రీయోగానంద నరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శ్రీమరకత రాజ్యలక్ష్మీ అమ్మవారి ఆలయ శిఖర నిర్మాణానికి భక్తులు భారీగా విరాళాలు అందించారు. పట్టణానికి చెందిన సోదరులు నిడమానూరి సురేంద్రబాబు, కల్యాణి, నిడమానూరి వెంకటశివరాంప్రసాదు, కన్య దంపతులు రూ.6 లక్షలు, భవిరిశెట్టి రామారావు, నాగమణికుమారి దంపతులు రూ.1,00,116, యాదల నాగయ్య యామా మధుసూదనరావులు రూ.25,116 చొప్పున విరాళంగా ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. వీరితో పాటు పలువురు భక్తులు రూ.11,116 చొప్పున అందచేసినట్టు కమిటీ ప్రతినిధులు కోవూరి శివశ్రీనుబాబు, వనమా సాంబశివరావు తదితరులు తెలిపారు.

నేడు వేంకటేశ్వరునికి గరుడ వాహన సేవ

సత్తెనపల్లి: పట్టణ రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 12న వైశాఖమాస 42వ పౌర్ణమి గరుడ వాహన సేవ జరుగుతుందని శ్రీవారి సేవా సమాజం ఆలయ ధర్మకర్తలు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం శ్రీవారికి స్నపన తిరుమంజనం, పరిమళ మల్లెలతో పుష్పాభిషేకం, మహాలక్ష్మీ అమ్మవారికి కస్తూరి కుంకుమ, పరిమళ మల్లెలతో విశేష పూజ జరుగుతుందన్నారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ'

ఏడీఏ బోయపాటి రవిబాబు

శావల్యాపురం: అర్హత కల్గియున్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు చేపట్టినట్లు ఏడీఏ బోయపాటి రవిబాబు ఆదివారం తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతు ఖాతాకు రూ.20వేలు నగదు ప్రభుత్వం నేరుగా జమ చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా ప్రస్తుతం రైతుసేవా కేంద్రాల్లో రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకాలు జిరాక్స్‌లు అందజేసి అప్రూవల్ చేయించిన తదుపరి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. వినుకొండ రూరల్‌లో 18,898, శావల్యాపురం మండలం 12, 559, ఈపూరు మండలం 15,139, బొల్లాపల్లి మండలం 17,988, నూజెండ్ల మండలంలో 18,300 మంది రైతుల సమగ్ర వివరాలు రైతుసేవా కేంద్రాల్లో ప్రచురణ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో ప్రాథమిక విచారణ జరుగుతుందన్నారు. ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హత పొందుతారన్నారు. ఈనెల 20లోపు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం పూర్తి చేసి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించే వారు, విశ్రాంత ఉద్యోగులు రూ.10వేలు దాటిన వేతనం పొందేవారు, లాయర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు తదితర వారందరూ ఈ పథకానికి అనర్హులన్నారు. వెబ్ ల్యాండ్‌లో భూమి కల్గిన రైతులు, అటవీశాఖ భూములు సాగు చేసే రైతుల జాబితాను మాత్రమే వేరిఫికేషన్ చేస్తున్నట్లు తెలిపారు.

పీఆర్‌సీ, డీఏ విడుదల చేయాలి



మాట్లాడుతున్న సీహెచ్ సుబ్బారావు

నాదెండ్ల: కూటమి ప్రభుత్వం పీఆర్‌సీ, డీఏలు ఎప్పుడు ఇస్తుందో ఉపాధ్యాయులు ఎదురు చూసే రోజులు ఏర్పడ్డాయని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. నాదెండ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పౌరులకు ప్రభుత్వాలు అందించే పౌరసేవలు ఎన్నో ఉన్నా, అన్ని రకాల సేవలు ప్రజలకు అందించేది ప్రభుత్వ ఉద్యోగులేనన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కోసం ఎన్ని అప్పులు చేసినా ప్రతి ఆరు నెలలకోసారి డీఏ క్రమం తప్పకుండా ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటివరకూ మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఉపాధ్యాయులకు చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి ప్రతి పదేళ్లకోసారి వేతన సవరణ అనేది రాజ్యాంగ, చట్టబద్ధమైందన్నారు. ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి రిపోర్టు వచ్చే వరకూ 30 శాతం ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కె.విజయ్‌కుమార్, జి అనిల్‌కుమార్ ఉన్నారు.

ముగిసిన ఏసుక్రీస్తు జూబ్లీ ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు

సత్తెనపల్లి: మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి ఏసుక్రీస్తు లోకానికి వచ్చాడని లోక రక్షకుడు ఏసు అని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని హోలీ ఫ్యామిలీ పాఠశాల ఆవరణలో జరుగుతున్న ఏసుక్రీస్తు జూబ్లీ–2025 ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. విశాఖ డివైన్ మెర్సీ ధ్యాన ఆశ్రమం డైరెక్టర్ రెవ.ఫాదర్ జుజ్జవరపు మరియదాస్ వాక్యోపదేశం చేశారు. మధ్యాహ్నం పాప సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా జుజ్జవరపు మరియదాస్ ప్రత్యేక స్వస్థత ఆరాధన చేపట్టారు. అనంతరం జూబ్లీ వేదిక నుంచి ప్రదర్శన ప్రారంభమై పట్టణంలోని గడియార స్తంభం వరకు కొనసాగి తిరిగి జూబ్లీ వేదిక వద్దకు చేరుకుంది. అనంతరం సమిష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. మహాఘన పీఠాధిపతులకు ఘన సన్మానం సత్తెనపల్లి డీనరీ గురువులు, డీనరీ సిస్టర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రేమ, క్షమ క్రీస్తు సందేశం అని, అలాంటి క్రీస్తు బోధనలతో మానవుడు సన్మార్గంలో నడవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏసు బోధించిన శాంతి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

• ఆదమరిస్తే గుంతే!



కొంకెరువాగు వంతెనపై పగలిపోయిన రెయిలింగ్, ప్రమాదకరంగా గుంతలు

మండల కేంద్రం శావల్యాపురంలో గుంటూరు – కర్నూలు జాతీయ రహదారిపై కొంకెరు వాగు వంతెనకు ఒక వైపు రెయిలింగ్ పగలిపోవటంతో ప్రమాదం పొంచియుంది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దానికితోడు వంతెనపై పెద్ద గుంతలు ఏర్పడి తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రిళ్లు వాహనాల లైట్ల దాటికి దారి కనిపించక గుంతలను తప్పించబోయి, రెయిలింగ్ లేక పెను ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతుందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ప్రమాదాలు జరగకముందే అధికారులు మేల్కొని గుంతలను పూడ్చివేయడంతో పాటు రెయిలింగ్ నిర్మించాలని కోరుతున్నారు. – శావల్యాపురం

అమరవీరులకు ఘననివాళి



రొంపిచర్లలో అమరవీరుడు మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



సరికొండపాలెం తండాలో జాతీయజెండాతో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న యువకులు

రొంపిచర్ల: భారత్–పాక్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లకు రొంపిచర్ల గ్రామంలోని స్థానిక చెరువు కట్ట సెంటర్లో ఆదివారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపెద్దలు, గ్రామస్తులు యుద్ధంలో మృతి చెందిన సత్యసాయి జిల్లాకు చెంది అమరవీరుడు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరులైన వీరజవాన్లకు జోహార్, ఉగ్రవాదం నశించాలి, పాకిస్థాన్ ఖబడ్దార్, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారతీయులు మృతి చెందారన్నారు. దీనికి ప్రతీకారంగా మనదేశం 'ఆపరేషన్ సిందూర్' కార్యక్రమంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసిందన్నారు. ఇరుదేశాలకు జరిగిన భీకర పోరులో మన దేశానికి చెందిన వీరజవాన్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మురళీనాయక్, మరి కొందరు జవాన్లు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతి చెందిన వీరజవాన్ల కుటుంబాలకు దేశ ప్రజలు అండగా ఉంటారన్నారు. సరికొండ వెంకటేశ్వరరాజు, పడాల వెంకిరెడ్డి, రామిరెడ్డి, పిడెం హుస్సేన్, సరికొండ తిమ్మరాజు, చక్రవరం సత్యం రాజు, ముక్కడాల వెంకటేశ్వరరావు, చక్రవరం బలరామరాజు, పసుమర్తి ఆదినారాయణ, గొడవర్తి వెంకటేశ్వర్లు, గరికపాటి తాతయ్య, గాడిపర్తి వెంకటకోటయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు ఘననివాళి

బొల్లాపల్లి: భారత్ – పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం చెందిన భరతమాత ముద్దుబిడ్డ, మురళీనాయక్ కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ మండలంలోని సరికొండపాలెం తండాకు చెందిన యూత్ సభ్యులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తండావాసులు మాట్లాడుతూ దేశంకోసం బంజారా జాతిముద్దుబిడ్డ వీరమరణం చెందడం గర్వకారణమన్నారు. మురళీనాయక్ ఆశయాలకు అనుగుణంగా యువకులు దేశసేవలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

మట్టి ఆకృతుల తయారీపై శిక్షణ



విద్యార్థులతో మంటితో కళాకృతుల రూపకల్పన చేయిస్తున్న దృశ్యం

యడ్లపాడు: సృజనాత్మకత నైపుణ్యాలు వెలికితీస్తే అవి విద్యార్థులకు భవిష్యత్తులో దారిచూపే దీపస్తంభాలుగా మారతాయని బాసట సంస్థ అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు చెప్పారు. స్వీయ నైపుణ్యాలను పెంపొందించేందుకు బాసట సామాజిక సాంస్కృతిక వేదిక చేపట్టిన వేసవి శిక్షణ తరగతులు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఏప్రిల్ 28 నుంచి మే 27 వరకు కొనసాగనున్న ఈ తరగతులలో భాగంగా, ఆదివారం ప్రత్యేకంగా మట్టితో ఆకృతుల తయారీపై శిక్షణ అందించారు. స్థానిక నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిక్షణకు విజయవాడకు చెందిన నైపుణ్యవంతుడు లక్ష్మణరావు హాజరై కళాకృతులపై తర్ఫీదు నిచ్చారు. అనంతరం విద్యార్థులు కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ రకరకాల బొమ్మలు, అలంకార వస్తువులు, గృహోపకరణాల్ని మట్టితో తయారు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. మాతృదినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన మాతాశిశు మట్టిబొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కాళిదాసు మాట్లాడుతూ ఈనెల 27న జరిగే ముగింపు కార్యక్రమంలో బాసట ఆధ్వర్యంలో ఉపకార వేతనాల అందించేందుకు నిర్వహించిన అర్హత పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీటర్, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, రామకృష్ణ, విన్ను, వినయ్ కుమార్, బేగం, నాగరాజు, డాక్టర్ రుషున్న మాస్టర్, ధనలక్ష్మి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

వైభవంగా శివయ్య రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న శ్రీగంగా పార్వతి సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి వారి నగరోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో శనివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించి ఆదివారం ఉదయం నగరోత్సవం జరిపారు. నూతనంగా నిర్మించిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ఈఓ శ్యామల రఘునాథరెడ్డి పచ్చజెండా ఊపి రథోత్సవం ప్రారంభించారు. దాదాపు 50 సంవత్సరాల తరువాత నిర్వహించిన రథోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని రథాన్ని తమ స్వహస్తాలతో పురవీధుల్లో తిప్పారు. మహిళల కోలాటాలు, భజనలు, గంగిరెద్దుల ప్రదర్శన, కేరళ వాయిద్యాలతో రథోత్సవం కోలాహలంగా కొనసాగింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీచైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, మద్ది బాలసుబ్రమణ్యం, గట్టుపల్లి సత్యనారాయణ, చేగు వెంకటేశ్వరరావు, పూజల చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

అరుదైన బ్లడ్‌గ్రూపుల వారి సేవలు నిత్యం అవసరం

- ఐఎంఏ భవనంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం
- రక్తదానం చేసిన 36 మంది యువతీ యువకులు
- ఆరోగ్యంగా ఉన్నవారు ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చు
- ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, డీఐ సునీత



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే చదలవాడ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సునీత, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: అరుదుగా దొరికే ఓ నెగటివ్, బి నెగిటివ్, ఏ బీ నెగిటివ్ వంటి బ్లడ్ గ్రూపుల వారి వివరాలను సేకరించి రిజిస్టర్ చేసి అత్యవసర సమయాలలో వారిని సంప్రదించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మార్గదర్శకత్వంలో ది నరసరావుపేట తాలూకా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సహకారంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ చదలవాడ, పల్నాడు జిల్లా డ్రగ్స్ కంట్రోలర్ ఆఫీసర్ డి.సునీత హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాలూకా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం మంచి విషయమని అన్నారు. తాము పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి బ్లడ్ బ్యాంకుకు తమ వంతు సహకారాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా డ్రగ్స్ కంట్రోలర్ ఆఫీసర్ సునీత మాట్లాడుతూ రక్తం అనేది కృత్రిమంగా ఫ్యాక్టరీలలో తయారయ్యేది కాదని. కేవలం మనుషులు నుండి సేకరించి ఆపదలో ఉన్నవారికి అందించాల్సి వుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కారణంగా బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు తక్కువగా ఉన్నాయని, డ్రగ్స్ కంట్రోలర్ ఆఫీసర్ సునీతను రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరగా వారు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారి సహకారంతో శిబిరాన్ని ఏర్పాటు చేయించారన్నారు. అందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని అన్నారు. ఆపరేషన్ సిందూర యుద్ధభూమిలో గాయపడ్డ సైనికులు సహాయం చేయగల సంస్థ రెడ్‌క్రాస్ మాత్రమేనని అన్నారు. యుద్ధం జరుగుతున్న సందర్భంలో రెడ్‌క్రాస్ నేషనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి దేశవ్యాప్తంగా ఉన్న రెడ్‌క్రాస్ అంబులెన్స్‌లు సిద్ధం చేయాలని సూచించారన్నారు. రక్తదానం చేసిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. రెడ్‌క్రాస్ కోశాధికారి గంటకోట మురళీకృష్ణ మాట్లాడారు. మొత్తం 36 మంది రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారందరికీ ముఖ్యఅతిథులు ప్రశంసాపత్రాలు అందజేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొత్తమాసు మెహర్‌బాబు, అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు, సెక్రెటరీ పీవీఎస్ మోహన్, ఎస్ఎస్‌వీ ప్రవీణ్, రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసగుప్తా, డాక్టర్ సృజన, సాంబశివరావు, చంద్రశేఖరరావు, బీవీఎల్ ప్రసాద్, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, మాజీ కౌన్సిలర్ మస్తాన్‌వలి, తాలూకా అసోసియేషన్ మెంబర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పాలేష్‌కు సేవాభూషణ్ అవార్డు



పాలేష్‌కు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

వినుకొండ: పల్నాడుజిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెద్దేటి పాలేష్‌కు తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సేవాభూషణ్ అవార్డు అందజేసింది. ఆదివారం విజయవాడలోని కళావేదికలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ చేతులమీదుగా అవార్డు అందజేశారు. పల్నాడు జిల్లాలో గత కొన్నేళ్లుగా దళిత, గిరిజన వర్గాలకు చేసిన సేవలకు గాను పాలేష్‌కు అవార్డు దక్కినట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సీఈఓ డాక్టర్ యూవీ రత్నం, అఖిల్, నూతల సురేష్, పొన్నెగంటి ప్రశాంతిలతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com